

డుంబ్రిగుడ మండలం కొర్రా రహదారిలో మంచు



కె.కార్తిక్



భావన

జాయింట్ కలెక్టర్ కార్తిక్ బదిలీ

విజయనగరం జేసీగా స్థానచలనం

- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సీఎస్ నిర్ణయం
- నియమితులైన ఐదు వారాల్లోనే మార్పు
- స్వస్థలం విశాఖపట్నం కావడమే కారణం
- స్థానిక జేసీగా గ్రామ, వార్డు సచివాలయాల ఏడీ భావన నియామకం

పాడేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి):

స్థానిక జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్‌ను విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న భావన(2019 ఐఏఎస్)ను నియమించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కె.కార్తిక్ పెనుకొండలో సబ్‌కలెక్టర్‌గా పని చేస్తుండగా, గతేడాది డిసెంబరు 19న అల్లూరి సీతారామరాజు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఆయన ఇక్కడ జేసీగా చేరిన ఐదు వారాలకే విజయనగరం జిల్లాకు బదిలీ కావడం విశేషం. అయితే కె.కార్తిక్ స్వస్థలం విశాఖపట్నం కావడంతో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో ఉండడంతో ఆయనను పక్క జిల్లా అయిన విజయనగరానికి బదిలీ చేశారని అధికారులు అంటున్నారు.

సీఎం జగన్‌కు కౌంట్ డౌన్ మొదలు

- ఇంటికి పంపేందుకు జనం సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

- వార్త 8వ పేజీలో..

పర్యాటక సందడి

సందర్శకులతో పోటెత్తిన పర్యాటక ప్రాంతాలు

- బొర్రా గుహలు మొదలుకుని లంబసింగి వరకు రద్దీ



చెరువులవేనంలో పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. ఏజెన్సీలో ఎక్కడ చూసినా పర్యాటకులే దర్శనమిచ్చారు. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు రద్దీ కనిపించింది.

అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి జలపాతం ప్రాంతాలను అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు.

వంజంగి మేఘాల కొండ వద్ద..

పాడేరు రూరల్: మండలంలోని వంజంగి మేఘాల కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. శనివారం రాత్రే పాడేరు చేరుకుని ఆదివారం వేకువజామున మేఘాల కొండకు చేరుకున్నారు. మంచు మేఘాలను, సూర్యోదయాన్ని తిలకించి పరవశించారు. ప్రకృతి అందాలను కెమెరాల్లో బంధించారు.



వంజంగి మేఘాల కొండపై సందర్శకులు

లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఆదివారం లంబసింగికి వేల సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. లంబసింగి, చెరువులవేనంలో ఉదయం ఐదు గంటల నుంచే పర్యాటకుల సందడి ప్రారంభమైంది. కొంత మంది పర్యాటకులు ముందు రోజే లంబసింగి చేరుకుని స్థానికంగా బస చేయగా, ఎక్కువ మంది ఆదివారం ఉదయం ఇక్కడికి చేరుకున్నారు. చెరువుల వేనం వ్యూపాయింట్ పర్యాటకులతో కిటకిటలాడింది. సందర్శకులు మంచు అందాలను ఆస్వాదించారు. అలాగే యర్రవరం జలపాతం, తాజంగి జలాశయంలోనూ పర్యాటకుల రద్దీ అధికంగా కనిపించింది. పర్యాటకులు అత్యధిక సంఖ్యలో లంబసింగికి చేరుకోవడం వల్ల ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు హైరానా పడ్డారు.

వణికిస్తున్న చలి

జి.మాడుగులలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



చింతపల్లిలో మంచు

పాడేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి):

మన్యంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో పొగమంచు, చలి ప్రభావం అధికమవుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు చలికి వణుకుతున్నారు. జి.మాడుగులలో 8, జీకేవీధిలో 11.6, చింతపల్లి, అరకులోయలో 12.8, పెదబయలులో 13, పాడేరులో 13.3, అనంతగిరిలో 13.4, హుకుంపేటలో 14.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. తాజా వాతావరణ పరిస్థితులు చూస్తుంటే, మరికొన్ని రోజులు ఇదే చలి కొనసాగే అవకాశాలున్నాయని స్థానికులు అంటున్నారు. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించక తప్పడం లేదు. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తున్నది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం చూపుతున్నది.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదుకావడంతో చలి ఉధృతి అధికంగా వున్నది. ఆదివారం జీకే వీధిలో 11.6, చింతపల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల గిరిజన గ్రామాల్లో చలి ప్రజలను ... మిగతా 8వ పేజీలో



పాడేరు- చింతపల్లి మార్గంలో ఆదివారం ఉదయం పొగమంచు

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

విద్యుత్తు కొనుగోళ్లు, చార్జీల పెంపుపై విశాఖ వేదికగా విచారణ

- వర్చువల్ విధానంలో అభిప్రాయాలు తెలపనున్న 71 మంది
- నాలుగు రోజులపాటు కార్యక్రమం



ప్రజాభిప్రాయ సేకరణకు ఈపీడీసీఎల్ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్‌సీ అధికారులతోపాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్‌ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

కాలానుగుణ పంటలపై అధ్యయనం

నేడు చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో జాతీయ సదస్సు

- తొలిసారిగా ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం నిర్వహణ
- హాజరుకానున్న దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు
- ఆదివాసీ రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని పరిచయం చేయడమే లక్ష్యం

చింతపల్లి, జనవరి 28:

ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్)లో తొలిసారిగా విశ్వవిద్యాలయం అధికారులు ఆదివాసీ రైతుల లాభసాటి వ్యవసాయంపై జాతీయ సదస్సును ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆదివాసీల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా 'పర్వత, గిరిజన వ్యవసాయం'పై నూతన సంస్కరణలు తీసుకొచ్చేందుకు శాస్త్రవేత్తలు, వివిధ విభాగాల నిపుణులు అధ్యయనం చేసి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయనున్నారు.

చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నిర్వహించే జాతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా పరిశోధన స్థానాలు, కేవీకే, డాట్ సెంటర్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖల్లో ఆదివాసీ వ్యవసాయంపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారులు, ఆచార్య ఎన్‌జీ రంగా ఉప కులపతి డాక్టర్ టి.శారద జయలక్ష్మి దేవి, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ టి.జానకి రామ్, హైదరాబాద్ ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ టి.తారా సత్యవతిలు హాజరుకానున్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికారుల సహకారంతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రతిష్ఠాత్మకంగా ఈ సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్ వాతావరణ పరిస్థితులు, నేలల ఆధారంగా తొమ్మిది వాతావరణ మండలాలుగా ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విభజించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాల్లో 41 గిరిజన ఉన్నత పర్వత శ్రేణి మండలాలను కలుపుకుని ఏడో వాతావరణ మండలిగా 1985లో చింతపల్లి మండల కేంద్రంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజనతో తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 37 మండలాలకు ఇది పరిమితమైంది. తాజాగా జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లా పరిధి ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండలాల ఆదివాసీ రైతుల వ్యవసాయ ప్రగతి కోసం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు.



పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న గ్లాడియోలస్(ఫైల్)



కుంకుమ పువ్వు



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

నూతన పంటలపై పరిశోధనలు

ఆదివాసీ రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా నూతన వాణిజ్య పంటలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. ప్రధానంగా ఉత్తరాదికి పరిమితమైన అరుదైన పూల సాగుపై మూడేళ్లుగా శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. ప్రధానంగా గ్లాడియోలస్, లిల్లియం, జెర్బరా, చైనా ఆస్టర్ పూలతోపాటూ కశ్మీర్‌కి మాత్రమే పరిమితమైన తులిప్ పూలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. పూల సాగు విజయవంతం కావడంతో పర్యాటక ప్రాంతాల గిరిజన రైతులతో పూల సాగు చేపట్టేందుకు శాస్త్రవేత్తలు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

తొలిసారిగా కుంకుమ పువ్వుపై పరిశోధనలు

పరిశోధన స్థానంలో ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తొలిసారిగా కుంకుమ పువ్వుపై ... మిగతా 8వ పేజీలో

పర్యాటక కేంద్రం.. అంధకారం

- అరకులోయలో వెలగని వీధి దీపాలు

- వార్త 8వ పేజీలో..

డొంకరాయి పవర్ కెనాల్‌లో లీకేజీ అడ్డుకట్టకు చర్యలు

గ్రౌటింగ్ ద్వారా నియంత్రించేందుకు శరవేగంగా పనులు



డొంకరాయి పవర్ కెనాల్ రీచ్-1 వద్ద లీకేజీ

- డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల

సీలేరు, జనవరి 28:

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్‌లో లీకేజీ అడ్డుకట్ట పనులను శరవేగంగా నిర్వహిస్తున్నట్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డొంకరాయి నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీరు విడుదల చేసే పవర్ కెనాల్ రీచ్-1లో లీకేజీ ఉన్నట్టు తమ సిబ్బంది గుర్తించడంతో ఆదివారం ఎల్‌సీ అనుమతులు తీసుకుని కెనాల్ నుంచి నీటి విడుదలను నిలిపివేశామన్నారు. దీని వల్ల 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి, 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని కూడా నిలిపి వేసి కెనాల్ లీకేజీ ప్రదేశంలో గ్రౌటింగ్ పనులను శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం రాత్రికి గౌటింగ్ పనులను పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ గ్రౌటింగ్ పనులు స్థానిక జెన్‌కో ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, సోమవారం నాటికి కెనాల్‌ను వినియోగంలోకి తీసుకురానున్నామని ఆయన వెల్లడించారు.



పవర్ కెనాల్ లీకేజీ వద్ద గ్రౌటింగ్ పనులు చేస్తున్న దృశ్యం

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, జనవరి 28: స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫారం చివర గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది రాజు ఆదివారం తెలిపారు. గుర్తు తెలియని రైలు శనివారం అర్ధరాత్రి గాని, ఆదివారం వేకువజామున గాని ఢీకొని ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, కృష్ణుడు కలర్‌పై గీతలు ఉన్న టీషర్ట్ ధరించి గెడ్డంతో ఉన్నాడని తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తించిన వారు దువ్వాడ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఆయన కోరారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలోని రామ్‌నగర్ సమీపంలో ఆదివారం గడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ట్రాలీ దగ్ధమైనట్టు అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామని, ట్రాక్టర్ ట్రాలీతోపాటు గడ్డి అగ్నికి ఆహుతైనట్టు తెలిపారు. టి.రామారావుకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ కాలిపోవడంతో సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి


మహాలక్ష్మి (ఫైల్)

కశింకోట, జనవరి 28 : మండలంలోని పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కన్నూరు మహాలక్ష్మి (63) మృతిపై అనుమానాస్పద కేసు నమోదు చేశామని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం అనారోగ్యంగా ఉండడంతో ఇంటివద్దకు వచ్చి వైద్యులు సేవలందించారన్నారు. ఆదివారం ఉదయం మహాలక్ష్మి ఇంట్లో మృతి చెందిందని మృతురాలు చెల్లెలు కుమారుడు సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు చేశామని ఆయన తెలిపారు.

31 కిలోల గంజాయి పట్టివేత

సింహాచలం, జనవరి 28 : అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు తరలిస్తున్న 31 కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు అడివివరం కూడలిలో ఆదివారం పట్టుకున్నారు. గోపాలపట్నం ఎస్‌ఐ వి.అప్పలనాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. అరకు సమీపంలోని ముంచంగిపుట్టు నుం చి అదే ప్రాంతానికి చెందిన కొచ్చే గోపాల్ (30) బొలెరో వాహనంలో గంజాయి ని సీట్ల కింద పెట్టి కొత్తవలస, పెందుర్తి, అడివివరం మీదుగా విశాఖ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు.ఎన్నికల నిమిత్తం అడివివరం కూడలిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టగా గంజాయి లభించింది. ఈమేరకు గోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడంతో పాటు గంజాయిని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అమలాపురం రోడ్డుపై విరిగిన కల్వర్టు

▸ రాకపోకలకు ఇబ్బంది పడుతున్న జనం


అమలాపురం రోడ్డులో విరిగిన కల్వర్టు

నక్కపల్లి, జనవర 28: మండలంలోని అమలాపురం ప్రధాన రహదారిపై రెండు నెలల క్రితం రహదారి కల్వర్టు విరిగిపోవడంతో పలు గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షానికి కల్వర్టు కూలిపోవడంతో అమలాపురం నుంచి వేంపాడు పరిసర గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత నెలలో సర్పంచ్ పెదపూడి శంకరరావు ఆధ్వర్యంలో కల్వర్టు విరిగిపోయిన చోట పక్కనే తాత్కాలికంగా గ్రావెల్ ఏర్పాటు చేసి మట్టి రహదారిని నిర్మించారు. కానీ ఇప్పటి వరకూ కల్వర్టు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నాళ్లు తాము ఈ బాధలు భరించాలంటూ సర్పంచ్ శంకరరావు, టీడీపీ నాయకులు గోవిందరావు, అప్పలరాజు, సత్తిబాబు, రాజు,కాసులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కల్వర్టును నిర్మించాలని కోరారు.

విశాఖలో సినీ నటి లావణ్య త్రిపాఠి సందడి


బీచ్‌లో చెత్తను సంచిలో వేస్తున్న సినీ నటి లావణ్య త్రిపాఠి

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సినీ నటి లావణ్య త్రిపాఠి ఆర్కే బీచ్‌లో ఆదివారం సందడి చేశారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైజాగ్ వాలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీచ్ క్లీనింగ్‌లో ఆమె పాల్గొన్నారు. అందమైన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, అనేక సూపర్ హిట్ సినిమాలు ఇక్కడే షూట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ వాలంటీర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తితత్వం పెంపొందించడంలో కృషి భేష్

▸ ప్రముఖ తెలుగు వేద కవి జొన్నవిత్తుల


మాట్లాడుతున్న జొన్నవిత్తుల

విశాఖపట్నం, జనవరి 28: తెలుగు రాష్ట్రాల్లో భక్తి తత్వాన్ని పెంపొందించేందుకు భక్త చైతన్య యాత్ర బృందం చేస్తున్న కృషి గొప్పదని ప్రముఖ తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు కొనియాడారు. పలు దేవా లయాలు సందర్శిస్తూ, వాటి నిర్వహణకు పలు సూచనలందిస్తున్న భక్త చైతన్యయాత్ర బృందం విశాఖ విచ్చేస్తున్నసందర్భంగా ఆదివారం ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన అభినందన సభకు ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, జొన్నవిత్తుల హాజరయ్యారు.ఈ సందర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ వేదం ఆధారంగా పండిత పామరులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకున్నారన్నారు. భారత దేశంలో దేవాలయాలనుంచే జ్ఞాన సముపార్జనవుతుందని తెలిపారు. వృత్తి నైపుణ్యాలను ఆలయాల్లో ప్రదర్శించి ప్రయోజనాలు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేవాలయాల ప్రాచుర్యం తెలియని వారు గుడుల్లో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో దేవాలయాలు శిథిలావస్థకు చేరడానికి ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. ప్రస్తుత ఈ దుస్థితికి ఆవేదన చెందిన జై తెలుగు పేరిట రాజకీయ పార్టీ స్థాపించినట్టు జొన్నవిత్తుల తెలిపారు. ప్రజల్లో భాష ఔన్నత్యం, ఆలయాలపై అవగాహన కల్పించడమే ల క్ష్యంగా స్థాపించిన ఈపార్టీ నుంచి ప్రముఖ పండితులు ఎన్నికల్లో పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాష, సంస్కృతి కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, పద్య కవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితుడు పీటీజీవీ రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చికెన్ ధరలు



బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు!

▸ 'మిచౌంగ్' కారణంగా మండలంలో 871 ఎకరాలలో పంట నష్టం
▸ జనవరి నాటికి ఆదుకుంటామని నాడు ప్రకటన
▸ నేటికీ అన్నదాతలకు అందని డబ్బులు


వర్షానికి నాతవరంలో కొట్టుకుపోయిన వరి పనలను తీస్తున్న రైతులు (ఫైల్)

నాతవరం, జనవరి 28: మిచౌంగ్ తుఫాన్ కారణంగా మండలంలో వరిపంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం ప్రకటించే నష్ట పరిహారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ఈ తుఫాన్ రావడంతో వివిధ గ్రామాల్లో పొలాల్లో కోసి ఉంచిన వరి పనలు వర్షానికి కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల పొలంలో ఉన్న పంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. రైతు భరోసా కేంద్రాలలో పనిచేసే వ్యవసాయ సహాయాధికారులు పొల్లాలోకి వెళ్లి కేవలం వరదలో తడిసిన వరి పనలను, అలాగే వరదలో కొట్టుకుపోయిన పంటలను చూసి నష్టాన్ని అంచనా వేశారు. నేలకొరిగిన వరి పంటకు మాత్రం నష్టాన్ని అంచనా వేయలేదు. తుఫాన్ కారణంగా మండలంలో 871 ఎకరాలలో మొత్తం 985 మంది రైతులు పంట నష్టపోవడం జరిగిందని గుర్తించారు. ఎకరానికి రూ.6,800 చొప్పున నష్టపరిహారం ఈ ఏడాది జనవరి నాటికి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నాడు అధికారులు ప్రకటించారు. నాటి నుంచి నేటి వరకు నష్టపరిహారం కోసం కళ్లుకాయలు కాసేలా రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోతోంది. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నామని పదేపదే ప్రకటనలు గుప్పించే ప్రభుత్వానికి పంట నష్టపోయిన రైతులను సకాలంలో ఆదుకోవాలన్న ఆలోచన లేకపోవడం ఏమిటని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయా రైతులు కోరుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 28: స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ఆలయ అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తూనే ఉన్నారు. గవరపాలెంలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం జరగడంతో బంధువుల ఇంటికి వచ్చిన వారు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా పాలకవర్గం, అధికారులు తగు చర్యలు చేపట్టారు.

చీకటి పడితే చాలు మందుబాబుల వీరంగం

▸ క్రీడా మైదానం, బస్టాండ్ సమీప వీధుల్లో ఆగడాలు
▸ రాకపోకలకు భయపడుతున్న మహిళలు


రేగుపాలెం ప్రధాన రోడ్డు పక్కన స్థలంలో తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలో పలు ప్రాంతాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో పట్టణ శివారు ప్రాంతాలు, బస్టాండ్ సమీప వీధులు, ఖాళీ వెంచర్లు, రైల్వేస్టేషన్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతాల్లో మందుబాబులు తాగి చిందేస్తున్నారు. చీకటి పడితే చాలు ఇక్కడకు చేరుకుని మద్యం తాగిన తర్వాత సీసాలను అక్కడే పగలుగొడుతున్నారు. ఆ ప్రాంతాల్లో సంచరించే ప్రజలకు, స్థానిక రైతుల గాజు పెంకులు కాళ్లకు గుచ్చుకుని గాయాలు పాలవుతున్నారు. ప్రధానంగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని రామాలయం వీధి పాన్‌షాపులు సమీపంలో, రైల్వేస్టేషన్ సమీపంలో స్కూలు రోడ్డు ప్రాంతంలో, పెంజెరువు ప్రాంతాల్లో, ఖాళీ వెంచర్లు, పంటపొలాల్లో మందుబాబుల డెన్‌లుగా మారాయి. బస్టాండ్ సమీపంలోని వీధిలో మందుబాబులు కారణంగా ఈ వీధిలో రాకపోకలు సాగించేందుకు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఎలమంచిలి రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో సైతం ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీస్ ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టి మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయకపోతే మళ్లీ ఆందోళన

▸ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగశేషు



సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

అనకాపల్లి టౌన్, జనవరి 28: అంగన్‌వాడీల సమస్యలపై ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగశేషు ప్రకటించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ పోరాట విజయోత్సవ సభ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగశేషు మాట్లాడుతూ 42 రోజులు అలుపెరగని పోరాటం చేసిన అంగన్‌వాడీలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలైలో జీతాలు పెంపునకు, ఇతర సమస్యలపై జీవోలు ఇవ్వడంతో డిమాండ్లు పరిష్కరించుకుని విజయం సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్. శంకరరావు, యూనియన్ ప్రతినిధులు వీవీ రమణమ్మ, జి.కుమారి, ఐద్వా ప్రతినిధులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్సులు లేక ఇక్కట్లు

▸ పట్టణానికి రోజూ వేలాది మంది రాకపోకలు
▸ వచ్చేవారు మల, మూత్ర విసర్జనకు అవస్థలు
▸ ముఖ్యంగా మహిళల పరిస్థితి మరీ దారుణం


ఎలమంచిలి పట్టణానికి వాహనాలపై వస్తున్న ప్రజలు

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలో సులభ్ కాంప్లెక్సులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం, మునిసిపాలిటీ కేంద్రం కావడంతో ఎలమంచిలి పట్టణానికి గ్రామాల నుంచి రోజూ వివిధ పనులు, వ్యాపార లావాదేవీలకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ మూత్ర, మల విసర్జనకు సులభ్ కాంప్లెక్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణణాతీతం. గతంలో కొమ్మాయి గుండం వద్ద సులాభ్ కాంప్లెక్సు ఉండేది. అయితే మూడేళ్ల క్రితం మునిసిపల్ అధికారులు ఈ సులభ్ కాంప్లెక్సును తొలగించారు. అయితే కొత్త నిర్మాణం చేపట్టలేదు. కాకివాని వీధి, ధర్మవరం ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులు స్థానికుల కోసం నిర్మించి చేతులు దులుపుకున్నారు. నిత్యం రిజస్ట్రేషన్‌ల కోసం, రెవెన్యూ, విద్యా సంస్థలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల పనులపైన, వ్యాపార లావాదేవీల కోసం నిత్యం వేలాది మంది ఎలమంచిలి వస్తుంటారు. కానీ వీరంతా మల, మూత్ర విసర్జనకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి పట్టణంలో ప్రజలకు అందుబాటులో సులభ్ కాంప్లెక్సులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

భారత్-ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్‌కు ఏర్పాట్లు

▸ ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి


స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 28: ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య ఫిబ్రవరి రెండో తేదీ నుంచి జరగనున్న అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌కు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి ఆదివారం స్టేడియంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలందించారు. పోలీసుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని, పార్కింగ్ ప్రదేశాల వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మ్యాచ్‌లో రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు (ఐదు రోజులకు పది వేల మంది) ఉచిత ప్రవేశం కల్పిస్తున్న నేపథ్యంలో అప్ర మత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించాలన్నారు. ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రికెట్ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 14,250 మంది క్రికెటర్లకు (రోజుకు 2,800 చొప్పున) ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఇరుజట్ల ఆటగాళ్లు రాక రేపు

హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు ముగిసిన నేపథ్యంలో రెండో తేదీ నుంచి ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టులో పాల్గొననున్న ఇరుజట్ల ఆటగాళ్లు మంగళవారం (30న) నగరానికి చేరుకోనున్నట్టు గోపీనాథరెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 3.25 గంటలకు విశాఖ చేరుకుంటారని, విమానాశ్రయం నుంచి బస్సుల్లో పోలీసుల భద్రత మధ్య హోటల్‌కు చేరుకుంటారన్నారు.

దొంగ ఓట్లతో గెలవాలని జగన్ చూస్తున్నారు

▸ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 28 : జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులకు ఆయన వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటరు జాబితాలను ప్రతీ ఒక్కరూ పరిశీలించాలన్నారు. అందులో ఎవరివైనా ఓట్లు లేకపోతే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు నామినేషన్లకు పది రోజుల ముందు వరకు ఎలక్షన్ కమిషన్ అవకాశం ఇచ్చినట్టు చెప్పారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు, ఇతర లోపాలు ఉంటే ఫారం 7 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, భావితరాల కోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి తీరాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వలంటీర్లను అడ్డంపెట్టుకొని తప్పుడు పనులు చేయడానికి చూస్తే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక అధికారులు వలన ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆర్డీవో, కలెక్టర్ లేదా ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

కొనసాగుతున్న సెర్ప్ ఉద్యోగుల సమ్మె

▸ నెహ్రూచౌక్‌లో ధర్నా


ధర్నా చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 28: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల సమ్మె రెండో రోజు ఆదివారం కొనసాగింది. సెర్ప్ ఉద్యోగులు నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ధర్నా చేసి నినాదాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న గ్రాట్యూటీ రూ.16 లక్షలు, హెచ్ఆర్‌పీ జీవోను సెర్ప్ ఉద్యోగులకు అమలు చేయాలని, సెర్ప్‌లో కారుణ్యనియామకాలు జరిపి మరణించిన కుటుంబాలకు న్యాయం చేయాలని, తదితర డిమాండ్లపై నినాదాలు చేశారు. సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి నానిబాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఉమా ప్రసాద్, సత్యసూర్య ప్రకాష్, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారుల దాడులు

▸ ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్


సీజ్ చేసిన గ్రావెల్ ట్రాక్టర్లు

ఎస్.రాయవరం, జనవరి 28: మండలంలోని పెద ఉప్పలం గ్రామంలో చేపట్టిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై దాడి చేసి, ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని కొండపై శనివారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్టు అందిన సమాచారంతో తమ సిబ్బంది దాడి చేసి, ఎక్స్‌కవేటర్‌తోపాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలంతా సిద్ధం

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

కొత్తూరు, జనవరి 28: సైకో జగన్‌రెడ్డిని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇక మిగిలింది 74రోజులు మాత్రమేనన్నారు. వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జగన్‌రెడ్డి అహంకార పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులంతా సిద్ధమయ్యారని తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, జిల్లా కార్యదర్శి మళ్ల గణేష్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో విజయ సాధన

▸ కాగ్ సీనియర్ ఆడిటర్ కేఎన్. రాజు పిలుపు


సదస్సులో మాట్లాడుతున్న కాగ్ ఆడిటర్ కేఎన్. రాజు

అనకాపల్లి టౌన్, జనవరి 28 : నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కేఎన్. రాజు పేర్కొన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో శ్రీధర్ సీసీఈ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రైల్వే ఉద్యోగాలు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయ నిర్వహణ, ఏకాగ్రత శక్తిని మెరుగుపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే పరీక్షల కోసం ప్రిపరేషన్ స్ట్రాటజీ, పరీక్షా సరళి, ప్రాథమిక, సొల్యూషన్ పుస్తకాల ప్రాధాన్యతలను రాజు వివరించారు. శ్రీధర్ సీసీఈ ఫాకల్టీ కె.సూర్య మాట్లాడుతూ భవిష్యత్తులో శ్రీ గౌరీ గ్రంథాలయంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సులు, ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఆర్‌బీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల పరీక్షలకు పలువురు అభ్యర్థులు హాజరయ్యారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

▸ మూడు తులాల బంగారం, నగదు బ్యాగును పోలీసులకు అప్పగింత
▸ అభినందించిన ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా


ఆటో డ్రైవర్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నర్సీపట్నం, జనవరి 28 : ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని నిరూపించుకుని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలివి. విశాఖపట్నం నుంచి గండికోట సూర్యాకాంతం అనే వృద్ధురాలు ఈనెల 25న నర్సీపట్నానికి బస్సులో విచ్చేసింది. ఇక్కడ దిగి బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. తిరిగి ఆమె ఆటో దిగినప్పుడు కంగారులో అందులో మూడు తులాలు బంగారు ఆభరణాలు, రూ.600 నగదుతో ఉన్న బ్యాగును మరిచిపోయింది. ఇది గుర్తించిన డ్రైవర్ చందు ఈశ్వరరావు వెంటనే పట్టణ సీఐ గణేశ్‌కు ఆ బ్యాగును అందజేశాడు. దీంతో పోలీసులు ఆ వృద్ధురాలి ఆచూకీ తెలుసుకొని ఆదివారం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సమక్షంలో ఆటో డ్రైవర్ చేతుల మీదుగా ఆమెకు బంగారం, నగదులో ఉన్న బ్యాగును అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని ఏఎస్పీ, సీఐతో పాటు ఎస్ఐ సుధాకరరావు, సిబ్బంది అభినందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్, పక్కన నాయకులు

వైసీపీకి ప్రజా కోర్టులో శిక్ష తప్పదు

టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీకి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రజలకు, వైసీపీ ప్రభుత్వానికి యుద్ధం మొదలైందన్నారు. ప్రజల చేతిలో ఆ పార్టీకి శిక్షణ తప్పదని స్పష్టం చేశారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఓటుతో బుద్ధి చెప్పి వైసీపీని ఇంటికి పంపడానికి సిద్ధమయ్యారని శ్రావణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజలంతా అదే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు పోవాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాకూరు వెంకటరమణరాజు, సాగిరి సుబ్బారావు, పాంగి పాండురంగ స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమాదేవి, సర్పంచ్ జ్ఞానప్రకాశ్, నాయకులు మహేశ్వరి, సత్యవతి, రాంబాబు, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధం

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జనవరి 28: జగన్‌ను ఓడించానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆదివారం కుమ్మరిపుట్టులోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైందని, సైకో రెడ్డికి ఇక మిగిలింది 74 రోజులు మాత్రమేనని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి ప్రారంభించిన యుద్ధం మొదలైందని, అందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. సైకో జగన్ అరాచక పాలనకు చెక్ పెట్టేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, రైతులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ప్రజాక్షేత్ర ధర్మ యుద్ధంలో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. బటన్ నొక్కుడు తమకూ వచ్చని, వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి ఇంటిదారి పట్టిందేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మహిళలు వెలుగెత్తి చెబుతున్నారన్నారు. మద్యపాన నిషేధం చేసిన తరువాతే ఎన్నికలకు వెళ్తామన్న జగన్ రెడ్డి, షాపులను నాసిరకం మద్యం షాపులుగా మార్చుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి ఖజానాను నింపుకుంటున్నారని గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. గడపగడపకు కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులను తిప్పికొట్టిన రాష్ట్ర ప్రజలు జగన్‌రెడ్డికి అడ్రస్ లేకుండా చేయడం తథ్యమని ఆమె పేర్కొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పాడేరు రూరల్, జనవరి 28: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన మోదకొండమ్మను దర్శించుకొనేందుకు, మొక్కులు తీర్చుకొనేందుకు మైదాన ప్రాంత భక్తులతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల పర్వతం, కొత్తపల్లి జలపాత సందర్శనకు వచ్చిన పర్యాటకులు బారులు తీరారు. అమ్మవారి మొక్కులు తీర్చుకొని పండగలను చేసుకున్న మైదాన ప్రాంత భక్తులు, ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకొని పండగను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో ఆనందంగా గడిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆలయం భక్తులతో కళకళలాడింది. భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో ప్రసాద కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, సిద్ధినాతి కొండలరావు, ముకుందరావు, పోతురాజు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి వద్ద ఉన్న అమ్మవారి పాదాల దర్శనకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా కనిపించింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సీలేరు గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

సీలేరు, జనవరి 28: సీలేరు బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాలలో 1984-85, 1985-86 బ్యాచ్‌లలో పదో తరగతి చదువుకున్న వారంతా పాఠశాలను సందర్శించి తమ పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనాటి అనుభవాలను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పంచుకున్నారు. అప్పట్లో పాఠశాలకు పక్కా భవనాలు లేకపోయినప్పటికీ రేకుల షెడ్లలోనే ఉంటూ ఏ విధంగా చదువులను కొనసాగించారో వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల మొదటి బ్యాచ్ విద్యార్థి, ప్రస్తుత ఏపీ జెన్‌కో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఈవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని అందిపుచ్చుకోవడానికి కృషి చేయాలని చెప్పారు. అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు పి.సుందరరాజు, పి.రమణరాజు, ఎల్.వేణుకుమార్, బి.రమేష్, సీలేరుకు చెందిన సీనియర్ క్రీడాకారుడు జాన్‌విలియమ్స్ పాల్గొన్నారు.

అధ్వానంగా దొరగూడ రహదారి



గతుకులతో ఆనవాళ్లు లేని రోడ్డు

ముంచంగిపుట్టు, జనవరి 28: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన మట్టి రహదారి రూపుమారిపోయింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతకు గురికాగా, పలుచోట్ల గతుకలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మత్తు పనులను చేపట్టకపోవడంతో ప్రస్తుతం రహదారి మరికాస్త అధ్వానంగా మారింది. దీంతో అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు ఆ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అతి కష్టంపై ద్విచక్ర వాహనాలు మాత్రమే నడుపుతున్నారు. రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందించినా ఫలితం కానరావడంలేదని గ్రామస్థులు వాపోయారు. సుమారు ఆరు కిలోమీటర్ల రహదారి పూర్తి స్థాయిలో రూపుమారిపోయిందని, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం.. అంధకారం!

» అరకులోయ ప్రధాన రహదారిలో వెలగని వీధి దీపాలు

» నెల రోజులుగా కారు చీకటి.. పర్యాటకులు, ప్రజల అగచాట్లు



దిష్టిబొమ్మల్లా ఉన్న ప్రధాన రహదారిలోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలు

అరకులోయ, జనవరి 28: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ ప్రధాన రహదారిలో అంధకారం అలముకొంది. రోడ్డు మధ్యలోని డివైడర్‌పై ఉన్న లైట్లు నెల రోజులు నుంచి వెలగడం లేదు. దీంతో దుకాణాలు తెరిచి ఉంచేవరకు మాత్రమే లైటింగ్ ఉంటుంది. దుకాణాలు మూసివేస్తే లైట్లు ఆర్పేయడంతో రహదారంతా చీకటిమయంగా మారుతోంది. పర్యాటకంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న అరకులోయలో వీధి దీపాలు వెలగకపోవడంలో పర్యాటకులు, స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ బిల్లులు భారీగా వస్తుండడంతో వీధి లైట్ల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ సక్రమంగా చేపట్టడం లేదని సమాచారం.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టూరిజం నిధులతో అరకు ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఐదేళ్ల పాటు పర్యాటక సంస్థ నిర్వహణ బాధ్యతను చక్కగా చేపట్టింది. అనంతరం పర్యాటక సంస్థ ఏర్పాటు చేసిన రహదారి విస్తరణ పనులు చేపట్టడంతో వీధి దీపాల స్తంభాలను తొలగించారు. ఏడాది క్రితమే రహదారి విస్తరణ పనులు పూర్తి కావడంతో డివైడర్ నిర్మించి, వాటి మధ్యలో లైటింగ్ ఏర్పాటుచేసి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇలా ఏర్పాటుచేసిన ఆరు నెలల పాటు దీపాలు సక్రమంగా పనిచేశాయి. తరువాత గత నెల రోజులుగా లైట్లు వెలగడం లేదు. పర్యాటక సంస్థ వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను తీసుకోకపోవడం, పంచాయతీ సక్రమంగా నిర్వహించలేకపోవడానికి తోడు విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో వీధి దీపాలను పట్టించుకునే నాథులే లేకపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అరకు ప్రధాన రహదారిలోని వీధి దీపాలు వెలిగేలా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పవర్ ప్రాజెక్టుపై వైసీపీ నేతలు నోరు విప్పరేం?

» టీడీపీ సీనియర్ నాయకుడు రీమల ఆనంద్



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత ఆనందరావు

చింతపల్లి, జనవరి 28: యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుపై వైసీపీ నాయకులు ఎందుకు నోరు విప్పడం లేదని టీడీపీ సీనియర్ నేత రీమల ఆనందరావు ప్రశ్నించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వ ఐదేళ్ల పాలనపై అసంతృప్తి చెందిన గిరిజన ప్రజలు అధిక సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో టీడీపీలో చేరికలపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రధానంగా జీవో నంబరు-3 అమలులో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందన్నారు. దేశ అత్యున్నత స్థానం జీవోను రద్దుచేస్తే చట్టంగా చేసి భద్రత కల్పించాల్సిన వైసీపీ ప్రభుత్వం, కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు అరకవేలి వచ్చి అధికారంలోకి వస్తే జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామని ప్రకటించడంతో వైసీపీ నాయకులు భుజాలు తడుముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ఆదివాసీల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పారావు, మంగు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్ పనులపై గిరిజనులు ఆగ్రహం

» రైవాడ జలాశయం, పలు గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన

» మట్టి పరీక్షల పనులు నిలుపుదల

» యంత్రాలను ఇక్కడి నుంచి వెంటనే తీసుకెళ్లాలని సిబ్బందికి హుకుం



బల్లిపురం వద్ద మట్టి పరీక్షల పనులకు వినియోగిస్తున్న యంత్ర పరికరాలను ఊడదీస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, జనవరి 28: మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బల్లిపురం నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి వరకు అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టడంపై గిరిజనులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు డి.వెంకన్నను వెంట బెట్టుకొని గిరిజనులు పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల రైవాడ జలాశయంతోపాటు చుట్టు పక్కల ఉన్న తామరబ్బ పంచాయతీలో ఏడు, చింతలపూడి పంచాయతీలో ఆరు గిరిజన గ్రామాలకు ప్రమాదం ఉందని నెల రోజుల క్రితం తాము చెప్పినప్పటికీ పనులు ఎందుకు కొనసాగిస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిల్ టెస్టింగ్ కోసం తీసుకువచ్చిన యంత్రాలను ఇక్కడ నుంచి వెంటనే తీసుకెళ్లకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అంతేకాక మట్టి పరీక్షల కోసం తీసుకువచ్చిన యంత్రాల విడిభాగాలను ఊడదీసి, సమీపంలోని రైతుల కల్లాల వద్ద వుంచారు. పనులు ఆపకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు జోక్యం చేసుకుని, ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలోసీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, గిరిజనులు జగన్నాథం, గంగులు, దాయిరి శ్రీను, గమ్మెల లక్ష్మణ, వీరన్నదొర పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



కురిడిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

డుంబ్రిగుడ, జనవరి 28: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కురిడి, గోరాపూర్, సంపంగిగెడ్డ, చాపరాయి తదితర గెడ్డల నుంచి అక్రమార్కులు ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేసి ఎక్కడికక్కడ అక్రమంగా నిల్వ చేస్తున్నారు. అనంతరం దర్జాగా రవాణా చేసేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక త్వకాలు, నిల్వలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. సొంతంగా ఇల్లులు నిర్మించుకునే లబ్ధిదారులను ఆసరాగా చేసుకుని అధిక ఇసుకను అక్రమంగా తరలిస్తూ రవాణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ నిల్వల కేంద్రాలపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా సాగిస్తున్న రవాణాను అరికట్టాలని, గిరిజనులు సొంతింటి కలను సాకారం చేయాలని, వ్యాపారులపై చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వణికిస్తున్న చలి

... 5వ పేజీ తరువాయి

వణికిస్తున్నది. ఉదయం, సాయంత్రం శీతలగాలులు అధికంగా వీస్తున్నాయి. అలాగే చింతపల్లి, లంబసింగి, తాజంగి, జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధ రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం పది గంటల వరకు మంచు కమ్మేస్తున్నది.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండలంలో చలి తీవ్రత కొనసాగుతోంది. రాత్రి నుంచి ఉదయం పది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. జాతీయ రహదారిలో మంచు వల్ల వాహనాలు లైట్లను వేసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామాల్లో చలిమంటలు వేసుకుని జనం ఉపశమనం పొందుతున్నారు. పర్యాటకులు మాత్రం మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. పర్యాటకులు ఆదివారం అంజోడ సిల్క్‌ఫాంలోని పీనరిలో మంచు అందాలను తిలకించి తమ కెమెరాల్లో బంధించారు.

కాలానుగుణ పంటలపై అధ్యయనం

... 5వ పేజీ తరువాయి



పరిశోధన స్థానంలో సాగు చేసిన లిల్లియం (ఫైల్ ఫొటో)

శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రారంభించారు. కశ్మీర్‌లోని పరిశోధన స్థానం శాస్త్రవేత్తల నుంచి నాణ్యమైన విత్తనం దిగుమతి చేసుకుని మూడు వాతావరణ పరిస్థితుల్లో గత ఏడాది సెప్టెంబరులో సాగును ప్రారంభించారు. షేడ్‌నెట్, గ్లాస్ హౌస్, ఓపెన్ ఫీల్డ్‌లో కుంకుమ పువ్వు సాగు చేపట్టారు. షేడ్‌నెట్, గ్లాస్ హౌస్‌లో సాగు చేపట్టిన కుంకుమ పువ్వు దిగుబడులు ఆశాజనంగా ఉన్నాయని, నాణ్యమైన కుంకుమ పువ్వు దిగుబడులు వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అత్యంత ఖరీదైన పంటల జాబితాలో ఒకటైన కుంకుమ పువ్వుపై మరో రెండేళ్లు పరిశోధనలు నిర్వహిస్తామని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రయోగాత్మక సాగు ఫలితాలు ఆధారంగా రైతులకు పరిచయం చేస్తామని, కుంకుమ పువ్వు సాగు గిరిజన ప్రాంతానికి అనుకూలమని నిర్ధారణ జరిగితే ఆదివాసీ రైతుల ఆర్థిక ప్రగతిలో పెనుమార్పు వస్తుందంటున్నారు.

రాజ్‌మా, వలిసెలల్లో నూతన వంగడాలపై ప్రయోగాలు

ఆదివాసీలు సంప్రదాయేతర పంటలుగా సాగు చేస్తున్న రాజ్‌మా, వలిసెల పంటల్లో నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేపడుతున్నారు. ఆదివాసీ రైతులు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేక ఆశించిన దిగుబడులు పొందలేకపోతున్నారు. సాగు విస్తీర్ణం పడిపోతున్నది. ఈ మేరకు రాజ్‌మా, వలిసెల పంటల్లో సుమారు పది రకాలపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. రాజ్‌మాలో అరుణ్, జ్వాలా రకాల విత్తనాలు వచ్చే ఏడాది చిరుసంచుల్లో రైతులకు శాస్త్రవేత్తలు అందుబాటులోకి తీసుకురానున్నారు.

అగ్రి టూరిజంతో ముందడుగు

పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అగ్రి టూరిజం ప్రాజెక్టును రూపొందించి పర్యాటకులను గిరిజన ప్రాంతానికి ఆకర్షించే విధంగా ముందడుగు వేశారు. వ్యవసాయంపై ప్రజలకు మక్కువ పెంచడంతో పాటు మనం తీసుకునే ఆహారం ఏ విధంగా వస్తుంది, దీని వెనక దాగివున్న రైతు శ్రమను పరిచయం చేసేందుకు అగ్రి టూరిజం కార్యక్రమానికి శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. పరిశోధన స్థానంలో పరిశోధనలు, పంటలు, నూతన వంగడాలు, ఆదివాసీ సంప్రదాయాలతో గిరిజన సమాచార కేంద్రం(మ్యూజియం) ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో ఆహారం అందించేందుకు గిరిజన సంప్రదాయ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. అతిథులు బస చేసేందుకు అతిథి గృహాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పరిశోధన స్థానం సందర్శించిన రైతులు సరదాగా వరి నాట్లు వేయడం, దుక్కి చేయడానికి ఓ ప్రత్యేక క్షేత్రాన్ని సిద్ధం చేశారు. దీంతో ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి వచ్చిన శాస్త్రవేత్తలు పరిశోధన స్థానాన్ని సందర్శించి ఓ కొత్త అనుభూతిని పొందుతున్నారు.

ఆదివాసీ రైతులను ప్రోత్సహించేందుకు..



-డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్, ఏడీఆర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, చింతపల్లి

ఆదివాసీ రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా మారుతున్న కాలానికి అనువైన పంటలు, నూతన యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై జాతీయ సదస్సులో నిపుణులు, శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తారు. ఈ ప్రణాళిక ఆధారంగా గిరిజన ప్రాంత రైతుల లాభసాటి వ్యవసాయానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ప్రోత్సహిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఉత్తర భారత దేశాన్ని పోలి వుంటుంది. గత ముప్పై ఏళ్ల వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే ప్రతి ఏడాది సీతాకాలం డిసెంబరు రెండో పక్షం నుంచి జనవరి రెండో పక్షం వరకు ఏక సంఖ్యలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చింతపల్లిలో ఐదు కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఈ పరిస్థితి లేదు. ఈ ఏడాది ఆరు కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాలేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం 1250 ఎంఎం కాగా ఈ ఏడాది 1190 ఎంఎం వర్షపాతం నమోదైంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. మారుతున్న వాతావరణానికి తగ్గట్టుగా వ్యవసాయంలోనూ వినూత్న సంస్కరణలు తీసుకురావలసి వున్నదని గుర్తించి ఈ జాతీయ సదస్సు ఏర్పాటు చేశాం.

సంక్షిప్తంగా..

ఎన్‌వైకే జిల్లా సలహా మండలి సభ్యుడిగా మత్స్యకొండబాబు



మత్స్యకొండబాబు

పాడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం జిల్లా సలహా మండలి సభ్యుడిగా పాంగి మత్స్యకొండబాబును నియమిస్తూ నెహ్రూ యువకేంద్రాల డైరెక్టర్ జనరల్ నితీశ్‌కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. హుకుంపేట మండలం మఠం గ్రామానికి పాంగి మత్స్యకొండబాబు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, బీజేపీ యువమోర్చా నేతగా చాలా ఏళ్లుగా పని చేస్తున్నారు. ఈక్రమంలో ఆయన్ని ఎన్‌వైకే జిల్లా సలహా మండలి సభ్యుడిగా నియమించారు. మత్స్యకొండబాబు నియామకంపై జిల్లాలోని బీజేపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఉత్తమ మహిళా ఉద్యోగిగా పుష్ప



కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పుష్ప

పాడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాచార శాఖ మహిళా ఉద్యోగిని బి.పుష్పను ఉత్తమ ఉద్యోగిగా గుర్తిస్తూ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. తమ శాఖలో ఉద్యోగినికి ఉత్తమ గుర్తింపు లభించడంపై సమాచార శాఖ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచుల సంఘం నిరసన దీక్షను విజయవంతం చేయాలి

పాడేరు రూరల్, జనవరి 28: గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల విధులు, నిధులు, బాధ్యతలపై రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసన దీక్షలను జిల్లా సర్పంచులు విజయవంతం చేయాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు కొట్టగుళ్లి ఉషారాణి, అరకు అసెంబ్లీ నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఆర్.రమేష్ ఒక ప్రకటనలో కోరారు. పంచాయతీ నిధుల దారి మళ్లింపు, సర్పంచుల బాధ్యతలు, పంచాయతీల నిర్వీర్యంపై రాజకీయ పార్టీలకతీతంగా పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పాడేరులో ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జి బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్ ప్రతినిధులు, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ నిరసన దీక్షలకు జిల్లా పరిధిలోని 22 మండలాలకు సంబంధించి పంచాయతీల సర్పంచులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సీఐ

పెదబయలు, జనవరి 28: మండలంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను జి.మాడుగుల సీఐ ఎస్.రమేశ్‌కుమార్ పరిశీలించారు. మండల పరిధిలోని వనభంగి, పెదకోడపల్లి, బొండాపల్లి పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేసిన బూత్‌లను ఆయన పరిశీలించారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకారం అదించాలని ఆయన కోరారు. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న నాటుసారా గ్రామాల్లో లేకుండా మహిళలు, విద్యావంతులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోజ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా



అంబులెన్స్, గంజాయి, నిందితులతో పోలీసులు

మోతుగూడెం, జనవరి 28: గంజాయి అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. ఇప్పటివరకు వివిధ వాహనాల్లో గంజాయిని పోలీసుల కళ్లుగప్పి రవాణా చేసిన వ్యాపారులు ఇప్పుడు కొత్తగా అంబులెన్స్ మాదిరి వాహనాలను వినియోగిస్తున్నారు. అంబులెన్స్ అనుకుని పోలీసులు ఆపకుండా వదిలేస్తారని వారి తెలివితేటలు. అయితే పోలీసులు అలాంటి వారి ఆటసైతం కట్టిస్తున్నారు. ఆదివారం అలాంటి అంబులెన్స్ మాదిరి గంజాయి రవాణా వాహనాన్ని పట్టుకున్నారు. మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 500 కిలోల గంజాయితో వెళుతున్న అంబులెన్స్‌ను ఆపి సరుకును స్వాధీనం చేసుకున్నారు. చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా తెలిపిన వివరాలు ప్రకారం.. వనదేవత దుర్గమ్మ గుడి అడవిలో ఫోర్స్ ట్రావెల్స్ వ్యాన్ ఏపీ 28 8787 అంబులెన్స్‌లో గంజాయిని మోతుగూడెం నుంచి రాజస్థాన్‌లోని జ్యోతిపూర్‌కు తరలిస్తుండగా మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో 500 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిసాకు చెందిన రామారావును అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్, ఒడిసాకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. గంజాయి విలువ రూ.25 లక్షలు విలువ ఉందన్నారు. పరారైన వారిని త్వరలో పట్టుకుంటామని మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐలు టి.రాజేశ్వరరావు, సూర్యనారాయణ, నూకరాజు, హెడ్ కానిస్టేబుల్ యుఆర్‌కే రాజు రమేష్, మురళి, శ్రీనివాస్, పోలీసులు సన్ని, బషీర్ ఉన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు

బుచ్చెయ్యపేట, జనవరి 28 : కశింకోట-బంగారుమెట్ట (కేబీ) రోడ్డులోని దిబ్బిడి వంతెన వద్ద గుంతలను టీడీపీ, జనసేన కార్యకర్తలు శ్రమదానంతో ఆదివారం పూడ్చారు. వారం రోజుల క్రితం ఈ వంతెన వద్ద పడిన గోతుల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పూడ్చాలని అధికారులను వేడుకుంటున్నా స్పందించకపోవడంతో టీడీపీ, జనసేన నాయకులే ముందడుగు వేశారు. గ్రావెల్‌ను తీసుకొచ్చి శ్రమదానంలో గోతును పూడ్చిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.